# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

**ప్రాంతీయ వార్తలు**

**తేది : 10-08-2024** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

**1 కేరళ రాష్ట్రంలోని వాయనాడ్ లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ పర్యటిస్తున్నారు.**

**2 సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర హోం శాఖ మంత్రి వి. అనిత సూచించారు.**

**3 ప్రతి ఒక్కరూ తమ ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు.**

**4 రాష్ట్రంలో వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ రాధికా రెడ్డి వెల్లడించారు**

**5 భారతరత్న, మాజీ రాష్ట్రపతి వి.వి.గిరి జయంతి ఈ రోజు.**

============================

కేరళ రాష్ట్రంలోని వాయనాడ్ లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ పర్యటిస్తున్నారు. ఈ ఉదయం ఢిల్లీ నుంచి కన్నూర్ విమానాశ్రయానికి చేరుకున్న ప్రధానమంత్రికి కేరళ గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్, ముఖ్యమంత్రి పినరయి విజయన్, కేంద్ర పర్యాటక, శాఖ సహాయ మంత్రి సురేష్ గోపి తదితరులు స్వాగతం పలికారు. అనంతరం ప్రధానమంత్రి హెలికాప్టర్‌లో వయనాడ్‌కు బయలుదేరి, కొండచరియలు విరిగిపడిన ప్రాంతాల్లో ఏరియల్ సర్వే ద్వారా ఆ ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం స్థానిక ఆసుపత్రిని ప్రధానమంత్రి సందర్శించి, విపత్తు నుంచి బయటపడిన వారితో సంభాషించనున్నారు.

---------------------------

సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర హోం శాఖ మంత్రి వి.అనిత సూచించారు. సైబర్ నేరాలపై అవగాహన కోసం ఈ రోజు విజయవాడలో వాకథాన్ లో విజయవాడ సీపీ తో కలసి మంత్రి సైబర్ మోసాలపై ఫిర్యాదుల కోసం రూపొందించిన యాప్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిత్య జీవితంలో వినియోగించే అనేక యాప్‌ల ద్వారా మోసాలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ నేరాల నియంత్రణకు రాష్ట్రస్థాయిలో సైబర్ సమన్వయ బృందం ఏర్పాటు చేస్తామని మంత్రి తేలిపారు. అనంతరం విజయవాడ సీపీ రాజశేఖర్ బాబు మాట్లాడుతూ సైబర్ నేరం జరిగిన వెంటనే 1930కు ఫోన్ చేయాలని సూచించారు. జాతీయ స్థాయిలో సైబర్ క్రైమ్ పోర్టల్.. మోసగాళ్ల ఆర్థిక లావాదేవీలను నిలిపివేస్తుందని చెప్పారు.

---------------------------

'సం మూడు విడతల్లో కౌన్సిలింగ్
ంచాల్సి ఉంటుందని, అక్టోబరు 1
పారు.



హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరూ తమ ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమం మూడవ విడతను ఈ రోజు ప్రారంభించారు.ఇందులో భాగంగా గుంటూరు కలెక్టరేట్ లోని తపాలా శాఖా కార్యాలయంలో విక్రయించనున్న జాతీయ జెండాలను కేంద్రమంత్రి ఆవిష్కరించారు.హర్ ఘర్ తిరంగా కార్యక్రమాలను విజయవంతం చేయాలని మంత్రి తెలుపారు.

---------------------------

రాష్ట్రంలో వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశానికి త్వరలో నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్టు ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ రాధికా రెడ్డి వెల్లడించారు. ఈ నోటిఫికేషన్ ద్వారా రాష్ట్రంలోని వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్ల భర్తీ చేస్తామని ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని 35 వైద్య కళాశాలల్లో 6,210 ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. సీట్ల భర్తీ కోసం మూడు విడతల్లో కౌన్సిలింగ్ నిర్వహిస్తామని చెప్పారు. ఈ నెల 16 లోగా ఆన్ లైన్ లో దరఖాస్తులు సమర్పించాల్సి ఉంటుందని, అక్టోబరు 1 నాటికి వైద్య కళాశాలల్లో అడ్మిషన్ల ప్రక్రియ పూర్తి చేస్తామని రాధికా రెడ్డి తెలిపారు.

---------------------------

అంతర్జాతీయ జీవ ఇంధన దినోత్సవాన్ని ఈరోజు జరుపుకుంటున్నాం. వాహనాల్లో డీజిల్ ద్వారా విడుదలవుతున్న కర్బన పదార్థాలను నివారించడానికి 'బయో డీజిల్' కు ప్రాధాన్యత ఏర్పడింది. మొక్కలు, వాటి అవశేషాల నుండి లభించే పదార్థాల ద్వారా జీవ ఇంధనం తయారవుతోంది. దీని ఫలితంగా కాలుష్య నివారణతో పాటు డీజిల్ వినియోగం తగ్గుతుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

---------------------------

పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు సూచించారు.తెలంగాణలోని శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఏవియేషన్ సెక్యూరిటీ కల్చర్ వీక్ నిర్వహించారు. కార్యక్రమంలో రామ్మోహన్ నాయుడు పాల్గొని మొక్కలు నాటారు. అనంతరం మాట్లాడుతూ.. ఏక్ పేడ్ మా కే నామ్ అమ్మ పేరుతో ఒక మొక్కను నాటాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారని చెప్పారు. పర్యావరణ పరిరక్షణలో మొక్కలు నాటడం ద్వారా తల్లిలాంటి ప్రకృతిని కాపాడుకోవచ్చని కేంద్రమంత్రి వివరించారు.

---------------------------

ఒంగోలు శాసన సభ నియోజకవర్గ పరిధిలోని 12 పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంల పరిశీలన నిర్వహించనున్నట్లు ప్రకాశం జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా తెలిపారు. ఒంగోలులో నిన్న ఆమె పాత్రికేయులతో మాట్లాడుతూ, ప్రస్తుతం నిర్వహించే ప్రక్రియ ఓట్ల పునః లెక్కింపు రీ కౌంటింగ్ అని, రీ పోలింగ్ కాదని స్పష్టం చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఒంగోలు శాసనసభ అభ్యర్థి బాలినేని శ్రీనివాసరెడ్డి ఫిర్యాదు నేపథ్యంలో ఈవీఎంల పనితీరును తిరిగి పరిశీలించేందుకు ఎన్నికల సంఘం నిర్ణయించిందని కలెక్టర్ తెలుపుతూ,

---------------------------

భారతరత్న, మాజీ రాష్ట్రపతి వి.వి.గిరి జయంతి ఈ రోజు. ఈ సందర్భంగా దేశానికి ముఖ్యంగా కార్మికరంగానికి ఆయన అందించిన సేవలను స్మరించుకుంటున్నాం. 1894 ఆగస్టు 10వ తేదిన ఒడిషాలోని బరంపురంలో ఆయన జన్మించారు. 1969 నుండి 1974 వరకు భారత రాష్ట్రపతిగా సేవలు అందించారు.

ఐక్యతా భావన దేశ భక్తిని పెంపొందించేందుకు ఉద్దేశించిన “హర్ ఘర్ తిరంగా” కార్యక్రమాన్ని స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈ నెల 15వ తేదీ వరకు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్నారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ప్రజలు తమ ఇళ్ళలో త్రివర్ణ పతాకాన్ని ఎగుర వేసి సంబంధిత సెల్ఫీలను అప్ లోడ్ చేయాలని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పిలుపునిచ్చారు. ప్రతి భారతీయునిలో ఐక్యతా భావనను పెంపొందించడమే ఈ కార్యక్రమ లక్ష్యమని తెలిపారు. ఇందులో భాగంగా రాష్ట్రంలో పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. విశాఖపట్నం జిల్లా వ్యాప్తంగా ఈ నెల 15వ తేదీ వరకు హర్ ఘర్ తిరంగా విశిష్టతను కాన్వాస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేందిర ప్రసాద్ తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హర్ ఘర్ తిరంగా బోర్డుపై తొలి సంతకం చేసి కార్యక్రమాలను ప్రారంభించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో కర్నూలు నగరాన్ని ప్రణాళిక బద్ధంగా ప్రజల సహకారంతో ఆదర్శవంత నగరంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టి.జి.భరత్ తెలిపారు. నిన్న కర్నూలు నగరంలో పలు అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, కర్నూలు నగరంలో 50 లక్షల రూపాయల వ్యయంతో మురుగు నీటి వ్యవస్థ నిర్మాణానికి శంకుస్థాపన చేశామని చెప్పారు. అభివృద్ధి పనులకు ప్రభుత్వం నిధులు విడుదల చేసిందని, నగరంలో మౌలిక సదుపాయాలను కల్పించేందుకు కృషి చేస్తామని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

పారిస్ ఒలింపిక్స్ లో భారత్ కు చెందిన చివరి పోటీదారు రెజ్లర్ రీతిక హుడా ఈరోజు మధ్యాహ్నం మహిళల ఫ్రీ స్టైల్ 76 కేజి ల విభాగంలో పాల్గొంటారు. మరోవైపు ఒలింపిక్స్ లో నిన్న జరిగిన పురుషుల 57 కేజీల ఫ్రీస్టైల్ పోటీలో భారత రెజ్లర్ అమన్ సెహ్రావత్ కాంస్య పతకం గెలుచుకున్నారు. కాంస్య పతకం సాధించిన భారత రెజ్లర్ అమన్ సెహ్రావత్ ను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్ ఖడ్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభినందించారు. అతి పిన్న వయస్సు కలిగినన కుస్తీ యోధుల్లో ఒకరైన అమన్ తన మొదటి ఒలింపిక్స్ లోనే పతకం సాధించారని ప్రశంసించారు అమన్ అచంచలమైన అంకితభావం, పట్టుదల ప్రపంచ వేదికపై దేశం గర్వించేలా చేశాయని పేర్కొన్నారు. ఈ పతకంతో పారిస్ క్రీడల్లో భారత్ కు లభించిన పతకాల సంఖ్య ఆరుకు పెరిగింది. కాగా, ప్రస్తుతం భారత్ కు ఐదు కాంస్య పతకాలు, ఒక రజత పతకం లభించాయి.

---------------------------

రాష్ట్రంలో వివిధ నీటిపారుదల ప్రాజెక్టులకు పేర్లను పునరుద్ధరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. గత ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులకు పెట్టిన పేర్లను మారుస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వైఎస్ఆర్ పల్నాడు కరవు నివారణ ప్రాజెక్టు పేరును గోదావరి–పెన్నా నదుల అనుసంధాన ప్రాజెక్టుగా నిర్ధారిస్తూ ఉత్తర్వులిచ్చారు. వైఎస్ఆర్ వేదాద్రి ఎత్తిపోతల పేరును ముక్త్యాల ఎత్తిపోతల పథకంగా మారుస్తూ ఆదేశాలిచ్చారు. మొత్తం 12 ప్రాజెక్టులకు వాటి అసలు పేర్లు అమల్లో ఉంటాయని పేర్కొన్నారు.

---------------------------